## క్లుప్తంగా

### ప్రహరీకి నిధులు మంజూరు

నవాబుపేట: కొల్లూర్ జెడ్పీ పాఠశాలకు ప్రహరీ కోసం ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి తన నిధుల నుంచి దాదాపుగా రూ. 50 లక్షలు కేటాయించినట్లు గ్రామస్తులు వివరించారు. ఈ మేరకు ఆయన సోదరుడు దుశ్యంత్‌రెడ్డి శనివారం పనులు ప్రారంభించారు. తులసీ రాంనాయక్, వాసుయాదవ్, రాంచంద్రయ్య, భూపాల్‌రెడ్డి, ఖాజా, రామకృష్ణ, జగన్‌మోహన్‌రెడ్డి, మోగ్యనాయక్ పాల్గొన్నారు.

### మంచి నడవడిక అవసరం

రాజాపూర్: విద్యార్థులు చదువుతో పాటు మంచి నడవడికను అలవర్చుకోవాలని సంస్కారభారతి సభ్యులు గోనెల రాధాకృష్ణ పేర్కొన్నారు. శనివారం నాన్‌చెరువు తండాలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పలకలు, నోట్‌బుక్‌లు, పెన్నులు, పెన్సిల్స్ తదితర వస్తువులను అందజేశారు. దాత కల్వాల రాఘవేందర్ పాల్గొన్నారు.

### ఆర్థిక సాయం

అడ్డాకుల: కందూర్ గ్రామానికి చెందిన తోకల రాములు మృతి చెందడంతో బీజేపీ జిల్లా నాయకుడు మున్నూర్ రమేష్ శనివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. రూ.5వేల ఆర్థికసాయం అందజేసి అండగా ఉంటానని తెలిపారు. అదే గ్రామానికి చెందిన తిరుపతయ్య ఆత్మహత్యకు పాల్పడటంతో బాధిత కుటుంబాన్ని పరామర్శించి అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. మాజీ ఎంపీటీసీ వీబీరాజు, శంకర్, రవి, జంగంశ్రీను, వడ్డెరాజు, చంద్రయ్య, బుడ్డన్న, ఆశన్న ఉన్నారు.

### అధ్యక్షుడిగా యాదయ్య

నవాబుపేట: పీఆర్‌టీయూ మండల నూతన అధ్యక్షుడిగా హజిలాపూర్ ఉపాధ్యాయుడు యాదయ్య ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు సంఘం రాష్ట్ర నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణయ్య తెలిపారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శిగా విజయ్‌కుమార్, అసోసియేట్ అధ్యక్షుడిగా మల్లికార్జున్, ఉపాధ్యాక్షులుగా రామచంద్రయ్య, అరుణదేవి, కార్యదర్శిగా పద్మజ తదితరులును ఎన్నుకున్నట్లు వివరించారు.

హన్వాడ: పీఆర్‌టీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులుగా వెంకటేశ్వర్‌రెడ్డి, పర్వతాలు, గౌరవాధ్యక్షుడిగా ఎంఏ అలీంతో పాటు ఇతర కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ముఖ్య అతిథులుగా అసోసియేట్ అధ్యక్షుడు భూపతిసింగ్, జిల్లా అధ్యక్షుడు శ్యామ్‌బాబు, ప్రధానకార్యదర్శి రమాకాంత్ హాజరయ్యారు.

### పీఎం విశ్వకర్మతో రుణ సదుపాయం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పీఎం విశ్వకర్మ పథకం ద్వారా రూ.3 లక్షల రుణ సదుపాయం పొందేందుకు అవకాశం ఉందని ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ శాంతయ్య పేర్కొన్నారు. ఈమేరకు కళాశాలలో విశ్వకర్మ పథకం ద్వారా శిక్షణ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ స్కీం ద్వారా శిక్షణ పొందిన వారికి పూర్తి స్థాయిలో ఆర్థిక, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందవచ్చని తెలిపారు.

### ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని వార్డు విజిటింగ్‌లో భాగంగా శనివారం 24వ వార్డులో పారిశుద్ధ్య కార్యక్రమాలు ముమ్మరం చేశారు. కౌన్సిలర్ ప్రశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ సిబ్బంది, అధికారితో కలసి పర్యటించారు. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టు కంచె ఏర్పాటు, ఇళ్ల మధ్య పిచ్చిమొక్కల తొలగింపు, రోడ్లపై గుంతలు పూడ్చటం, క్లబ్‌రోడ్డులో స్పీడ్‌బ్రేకర్ల ఏర్పాటు పర్యవేక్షించారు. ఏవైనా సమస్యలున్నట్లయితే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. 23వ వార్డు కౌన్సిలర్ ఉమా శంకర్‌గౌడ్ పాల్గొన్నారు.

### కొండా లక్ష్మణ్ బాపూజీకి నివాళి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): తెలంగాణ రాష్ట్ర ఏర్పాటే లక్ష్యంగా తన చివరి శ్వాస వరకు తపించిన కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలు కొనసాగిద్దామని మున్సిపల్ మాజీ చైర్మన్ నర్సిములు అన్నారు. శనివారం ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కౌన్సిలర్లు రవి కిషన్‌రెడ్డి, శ్రీనివాస్, వినోద్, శ్రీనివాస్‌రెడ్డి, నవకాంత్, సుధాకర్,కిషన్‌పవర్, ఇమ్రాన్ పాల్గొన్నారు.

### వ్యక్తి ఆత్మహత్యాయత్నం

జడ్చర్ల: స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో శనివారం ఓ వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. రైల్వే ఎస్ఐ సయ్యద్ అక్బర్ కథనం మేరకు.. భూత్పూర్ మండలం కొత్తూరు గ్రామానికి చెందిన వాజీద్(29) ఆత్మహత్యా యత్నం చేశాడు. రైలుకింద పడగా అతడికి తీవ్ర గాయాలు అయ్యాయి. దీంతో అక్కడి సిబ్బంది గుర్తించి 108 అంబులెన్స్‌లో వైద్య చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియరాలేదు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# పర్యావరణాన్ని రక్షించుకుందాం



న్యూప్రేమ్‌నగర్‌లో చెత్త సేకరిస్తున్న పాలమూరు మున్సిపల్ సిబ్బంది



జడ్చర్లలో స్వచ్ఛత హీ సేవ ర్యాలీ




పద్మావతికాలనీలో పేదలకు పాత దుస్తులు అందజేస్తున్న మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలో 'స్వచ్ఛత హీ సేవ' నాలుగోరోజుకు చేరింది. ఇందులో భాగంగా శనివారం 7, 8, 25, 38వ వార్డుల పరిధిలో వివిధ కార్యక్రమాలు చేపట్టారు. ఆయా వార్డుల్లో చెత్తతో పాటు వ్యర్థ పదార్థాలను సేకరించారు. న్యూప్రేమ్‌నగర్‌లో మున్సిపల్ సిబ్బంది, మహిళా సంఘ సభ్యులతో ర్యాలీ నిర్వహించారు. కాగా, గతంలో రెడ్యూస్‌– రీయూజ్‌– రీసైకిల్ (ఆర్ ఆర్ఆర్) ద్వారా సేకరించిన పాత దుస్తులను ఇప్పుడు పద్మావతికాలనీలోని కమ్యూనిటీ హాలులో పేదలకు అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ వచ్చే నెల 2వ తేదీ వరకు 'స్వచ్ఛతా హీ సేవ' కొనసాగుతుందన్నారు. ఒక్కో రోజు ఒక్కో కార్యక్రమం చేపడుతున్నామన్నారు. ముఖ్యంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్లాస్టిక్ కవర్లకు బదులు జ్యూట్ బ్యాగ్‌లనే వాడి పర్యావరణ పరిరక్షణకు అందరూ పాటు పడాలన్నారు. ఎక్కడబడితే అక్కడ చెత్త వేయొద్దని, ఇంటింటికీ వచ్చే స్వచ్ఛ ఆటోలకు తడి, పొడి చెత్తను వేరు చేసి ఇవ్వాలన్నారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కట్టా రవికిషన్‌రెడ్డి, పుల్లా నీరజ, మెప్మా సీఓ యాదయ్య, మున్సిపల్ జవాన్ సిరాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

జడ్చర్ల టౌన్: స్వచ్ఛత హీ సేవ 2024లో భాగంగా శనివారం మున్సిపాలిటీ సంఘ కార్యాలయం నుంచి కావేరమ్మపేట చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ ఎస్.రాజయ్య ప్రారంభించగా మున్సిపల్ అధికారులు, సిబ్బంది అశోక్‌కుమార్, శివకుమార్, శ్వేతతోపాటు స్థానికులు పాల్గొన్నారు. ర్యాలీనుద్దేశించి మున్సిపల్ కమిషనర్ రాజయ్య మాట్లాడారు. ప్రతి ఒక్కరు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

# రోడ్డు పనులకు నాసిరకం మట్టి



రోడ్డు విస్తరణ పనుల్లో వినియోగిస్తున్న నాసిరకం మట్టి

జడ్చర్ల: స్థానిక సిగ్నల్‌గడ్డ వద్ద కొనసాగుతున్న రోడ్డు విస్తరణ పనులు నాసిరకంగా సాగుతున్నాయన్న ఆరోపణలు వస్తున్నాయి. రోడ్డు విస్తరణ పనులకు నాసిరకం మట్టిని వినియోగిస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. కాగా గతంలో రోడ్డు విస్తరణ పనులలో భాగంగా తొవ్వి పక్కకు పోసిన మట్టినే మళ్లీ రోడ్డు పనులకు వినియోగిస్తున్నారని చెబుతున్నారు. ఈ మట్టిలో నాణ్యత లేదని, దుమ్ము, ధూళితో పాటు ప్లాస్టిక్ కవర్లు, మట్టి దిబ్బలు, టైర్లు, రాళ్లు, రప్పలు, ఇటుక పెళ్లలు తదితర మిశ్రమాల మట్టిని వినియోగిస్తున్నారని పేర్కొంటున్నారు. ఈ మట్టిపై కంకర పోసి బీటీ పనులు చేసిన అనంతరం రోడ్డు నాణ్యత దెబ్బతినే అవకాశాలు ఉన్నాయన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అంతే గాక అంబేడ్కర్ చౌరస్తా వైపు పాత రోడ్డును తొవ్వకుండానే (పిక్కింగ్) పైపై మట్టి పోసి రోలర్‌తో చదును చేసి రాకపోకలకు వీలు కల్పించారు. ఈ మట్టి పనులకు సంబంధించి కూడా అధికారుల పర్యవేక్షణ లేదు. శనివారం కల్వకుర్తి రోడ్డు వైపు కూడా నాణ్యత లేని రాళ్లు, కవర్లు గల నల్ల మట్టిని తీసుకువచ్చి చదును చేశారు. ఇప్పటికైనా ఉన్నత అధికారులు స్పందించి రోడ్డు పనులను తనిఖీ చేసి నాణ్యతగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# ఉద్యోగ విరమణ బెనిఫిట్స్ ఇవ్వాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): రాష్ట్ర ప్రభుత్వం పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు, పెన్షనర్లకు బెనిఫిట్లను వెంటనే ఇవ్వాలని.. టీఎస్‌జీఓ జిల్లా అధ్యక్షుడు రాజీవ్‌రెడ్డి, కార్యదర్శి చంద్రనాయక్, కోశాధికారి కృష్ణమోహన్, అసోసియేట్ అధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఏళ్లుగా ఈ కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే చెల్లించకపోతే పోరాటాలు చేసేందుకు వెనుకాడమని తెలిపారు.

# మహిళా సాధికారతే కాంగ్రెస్ లక్ష్యం



మహిళలకు ప్రొసీడింగ్స్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి

దేవరకద్ర రూరల్: మహిళా సాధికారతే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి అన్నారు. శనివారం దేవరకద్రలో నిర్వహించిన మహాలక్ష్మి పథకం ప్రొసీడింగ్స్ పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికల హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కొక్కటిగా అమలు చేసుకుంటూ వస్తోందన్నారు. అందులో భాగంగానే మహిళలకు ఉచిత బస్సు, జీరో విద్యుత్ బిల్లు, రైతు రుణమాఫీలతో పాటు మహాలక్ష్మి పథకం అమలు చేస్తున్నట్లు వివరించారు. త్వరలోనే రైతుభరోసా.. పంటకు మద్దతు ధరతో పాటు రూ.500ల బోనస్‌ను అందిస్తామని అన్నారు. ఎంఆర్ఓ శ్రీనివాసులు, ఎంపీడీఓ శ్రీనివాస్, ఈఓ సీత్యానాయక్, మండల అధ్యక్షుడు అంజిల్‌రెడ్డి, రాఘవేందర్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ లక్ష్మీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సమాజ సేవకులకు వందనం



పోలీస్ సిబ్బందిని సన్మానిస్తున్న మౌంట్‌బాసిల్ విద్యార్థులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాకేంద్రం సమీపంలోని మౌంట్‌బాసిల్ హైస్కూల్ విద్యార్థులు 'సమాజ సేవకులకు వందనం' పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహబూబ్‌నగర్ పట్టణంలోని పోలీస్‌స్టేషన్ సిబ్బందిని, ట్రాఫిక్ పోలీసులను, ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులను, రైతులను గౌరవప్రదంగా కలిశారు. సమాజంలో వైద్యులు, పోలీసులు, రైతులు చేస్తున్న సేవలను గుర్తించి వారికి మిఠాయిలు తినిపించి, ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సమాజంలో వారి పాత్ర ఎంత ఉందో విద్యార్థులు తెలుసుకున్నారు. కాగా.. విద్యార్థుల ఇలా తమన సన్మానించడం ఎంతో గొప్పగా ఉందని వైద్యులు, పోలీసులు, అన్నదాతలు ఆనందం వ్యక్తం చేశారు. విద్యార్థులకు సమాజం పట్ల అవగాహన కల్పించేందుకు పాఠశాల యాజమాన్యం ప్రోత్సాహంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ప్రిన్సిపాల్ సోమశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ చంద్రకళా వెంకటయ్య, డైరెక్టర్లు శిరీష ప్రవీణ్, పూజితా మోహన్‌రెడ్డి, సుశాంత్ కృష్ణ, హింది ఉపాధ్యాయురాలు లలితా, తదితరులు విద్యార్థులను అభినందించారు.

# 'కుటుంబాలు వీధిన పడ్డాయి'



కలెక్టర్ విజయేందిరకు వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): పంచాయతీ పరిధిలో ఉన్న లే అవుట్ల రిజిస్ట్రేషన్లు వెంటనే చేయాలని మహబూబ్‌నగర్ రియల్ ఎస్టేట్స్ అసోసియేషన్ జేఏసీ చైర్మన్ అహ్మద్‌అలీ, వైస్ చైర్మన్ హైదర్ అలీలు డిమాండ్ చేశారు. శనివారం కలెక్టర్ విజయేందిరకు వినతి పత్రం సమర్పించారు. లేఅవుట్లలో మిగిలి ఉన్న ప్లాట్లను వెంటనే ప్రారంభించే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవాలన్నారు. అన్ని అర్హతలు ఉన్న లే అవుట్ల, హౌస్ క్రన్‌స్ట్రక్షన్ పర్మిషన్లలో జాప్యం లేకుండా వెంటనే ఇవ్వాలని కోరారు. ప్లాట్ల క్రయ విక్రయాలు లేక పోవడంతో వందలాది కుటుంబాలు వీధిన పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థికంగా చితికి పోయామని వాపోయారు. కాగా సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకుపోయి సమస్య పరిష్కారం అయ్యేలా చూస్తానని కలెక్టర్ పేర్కొన్నారు. అసోసియేషన్ కన్వీనర్లు చందుయాదవ్, రవికిరణ్, కృష్ణయ్య, రమేష్, వైస్ చైర్మన్ ప్రవీణ్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

### కానిస్టేబుల్‌పై క్రమశిక్షణ చర్యలు

జడ్చర్ల: గొడవ జరుగుతుందంటూ బాధితుడు కాల్ చేయగా.. అక్కడకు వెళ్లిన 100 డయల్ కానిస్టేబుల్స్‌లో ఒకరు నిబంధనలను అతిక్రమించారని బాధితులు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఎస్పీ జానకీ క్రమశిక్షణ చర్యలు చేపట్టిన ఘటన శనివారం జడ్చర్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. పోలీస్ స్టేషన్ సమీపంలో ఇంటి స్థలం విషయంలో ఓ తండ్రి కుమారుడు బాలస్వామి, వేణుగోపాల్ మధ్యా విభేదాలు వచ్చాయి. ఈ క్రమంలో సంబంధిత స్థలం బాలస్వామి వెళ్లాడు. దీంతో కుమారుడు వేణుగోపాల్ 100 డయల్‌కు ఫిర్యాదు చేశాడు. ఇద్దరు కానిస్టేబుల్స్ ఘటన స్థలానికి వచ్చారు. కాగా అక్కడ బాలస్వామి, కానిస్టేబుల్స్‌కు వాగ్వివాదం చోటు చేసుకుంది. కానిస్టేబుల్ నర్సిములు దురుసుగా మాట్లాడారంటూ బాలస్వామి పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో జిల్లా కార్యాలయానికి అటాచ్ చేసినట్లు సీఐ ఆదిరెడ్డి తెలిపారు.

### యువతి ఆత్మహత్య

మిడ్జిల్: మండల కేంద్రానికి చెందిన అఖిల(21) శనివారం ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు గ్రామస్తులు తెలిపారు. వారి కథనం ప్రకారం.. అఖిల తండ్రి ఇటీవల మరణించారు. అప్పటి నుంచి ఆమె మానసిక స్థితి సరిగా లేదు. ఈ క్రమంలో శనివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. ఘటనపై ఫిర్యాదు అందలేదని ఎస్ఐ శివనాగేశ్వర్ నాయుడు తెలిపారు.

### విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



దేవరకద్ర రూరల్: విద్యార్థులు క్రీడల్లో రాణించాలని కౌకుంట్ల ఉన్నత పాఠశాల హెచ్ఎం మంజులత అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఎస్జీఎఫ్ మండలస్థాయి అండర్17, అండర్ 14 పోటీలను నిర్వహించారు. కౌకుంట్ల, పేరూర్, అప్పంపల్లి విద్యార్థులు పాల్గొన్నారు.

నవాబుపేట: విద్యార్థులకు క్రీడలు చాలా అవసరమని ఎంపీడీఓ జయరాంనాయక్, ఎస్ఐ విక్రమ్ అన్నారు. శనివారం ఎస్జీఎఫ్ అండర్‌–14, అండర్ 17 క్రీడలు నిర్వహించారు. హెచ్ఎంలు నాగ్యనాయక్, దశరథ్‌నాయక్, పీఈటీ వినోద్, అజహర్‌అలీ, విజయ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

### టై, బెల్టులు పంపిణీ

జడ్చర్ల టౌన్: రామస్వామిగుట్టతండా ప్రాథమిక పాఠశాలలోని 47మంది విద్యార్థులకు శనివారం సీఐఎస్ఎఫ్ జవాన్ కె. శివ టై, బెల్టులు పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు కార్పొరేట్ తరహా భావించాలనే ఉద్దేశ్యంతోనే తనవంతుగా సాయం చేసినట్లు పేర్కొన్నారు. హెచ్ఎం రవి ఉన్నారు.

### విద్యార్థుల ప్రగతిపై చర్చించాలి

నవాబుపేట: విద్యార్థుల ప్రగతిపై తల్లిదండ్రులు తరచూ చర్చించి సూచనలు చేయాల్సిన అవసరం ఉందని ఎంఈఓ రాజునాయక్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల హాజరుపై దృష్టి పెట్టాలన్నారు. క్రమం తప్పకుండా పాఠశాలకు పంపించాలని సూచించారు. సీఆర్‌పీ జనార్దన్, హెచ్ఎం లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

మహమ్మదాబాద్: చిన్నవార్వాల్ ప్రాథమిక పాఠశాలలో శనివారం ఎస్ఎంసీ సమావేశం నిర్వహించారు. విద్యార్థుల తల్లిదండ్రులతో పాఠశాల సమస్యలపై చర్చించారు. హెచ్ఎం అరుణ, ఉపాధ్యాయులు కృష్ణ, వెంకటయ్య, సికిందర్, తుకారాం పాల్గొన్నారు.

### వాటర్‌మెన్‌ను కొనసాగించాలి



కోయిల్‌కొండ: పంచాయతీలలో పనిచేస్తున్న వాటర్‌మెన్లను ప్రభుత్వం కొనసాగించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎదిరింటి నర్సిములు అన్నారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీఓ నజీర్‌హైమద్‌కు వినతి సమర్పించారు. కార్మికుల పొట్టకొట్టడం సరైన పద్ధతి కాదన్నారు. పాత వారిని తొలగిస్తే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

### హాస్టల్ ప్రారంభించాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: కొల్లాపూర్ పీజీ సెంటర్‌లో నూతనంగా నిర్మించిన హాస్టల్‌ను వెంటనే ప్రారంభించాలని పీయూ జేఏసీ నాయకులు రాము పేర్కొన్నారు. ఈమేరకు పీయూలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. హాస్టల్ ఉన్నా.. ప్రారంభించక పోవడం వల్ల విద్యార్థులు అడ్మిషన్లు వెనక్కి తీసుకునే పరిస్థితి ఉందన్నారు. సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు.

### ప్రైవేట్ పాఠశాలపై ఫిర్యాదు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: మహ్మదాబాద్ మండలంలో ఓ పాఠశాలను నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నారని వెంటనే చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో డీఆర్వోకు కలెక్టర్ కార్యాలయంలో శనివారం ఫిర్యాదు చేశారు. కనీస సౌకర్యాలు లేవని.. 8వ తరగతి అనుమతి లేకుండా నిర్వహిస్తున్నారని, హైవేపై ఉన్నప్పటికీ ప్రహరీ ఏర్పాటు చేసుకోలేదని పేర్కొన్నారు. అన్ని తెలిసి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఎంఈఓపై కూడా చర్యలు తీసుకోవాలని కోరారు.

### అప్పంపల్లిలో భగవద్గీత పారాయణం



చిన్నచింతకుంట: అప్పంపల్లి గ్రామ వేణుగోపాలస్వామి ఆలయంలో నెల్లూరు జిల్లాకు చెందిన స్వామి బాలచంద్ర భాగవత శనివారం రాత్రి భగవద్గీత పారాయణం చేశారు. ఈ సందర్భంగా స్వామి వారు మాట్లాడుతూ భగవద్గీత మానవ జీవన సమరంలో సంక్లిష్ట సమయంలో మనోధైర్యాన్ని ప్రసాదిస్తుందన్నారు. ప్రతిఒక్కరు భగవద్గీత సారాంశాన్ని తెలుసుకొని దైవ మార్గాన్ని అలవర్చుకోవాలన్నదే తన లక్ష్యమని పేర్కొన్నారు. దేశమంతట పారాయణం చేయాలన్నదే తన ఉద్దేశమన్నారు. నెల్లూరులో కార్యక్రమం ప్రారంభించి ఇప్పటికే వివిధ రాష్ట్రాల్లో దాదాపు 500 వందల గ్రామాల్లో భగవద్గీత పారాయణం చేసినట్లు వివరించారు.

### బాలికలు కరాటే నేర్చుకోవాలి



మహబూబ్‌నగర్ క్రీడలు: ఆత్మరక్షణ కోసం బాలికలు కరాటే మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాలని హెచ్ఎం రహీం అహ్మద్ ఫారుఖీ అన్నారు. మహాత్మాగాంధీ రోడ్డు స్కూల్‌లో శనివారం కరాటే శిక్షణను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం మూడు నెలలపాటు బాలికలకు కరాటే శిక్షణను ఏర్పాటు చేసినట్లు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉపాధ్యాయులు భాస్కర్, అతహర్ అహ్మద్, ఖతలయ్య, సాజిద్‌ఖాన్, నదీం, చారి, రహీం, నవీన్‌కుమార్, గోపాల్, ఎస్ఎన్.ఖాద్రీ, సంతోష్‌తోపాటు కింగ్‌షోటోకాన్ క్లబ్ ఫౌండర్ జహంగీర్‌పాష ఖాద్రీ పాల్గొన్నారు.

### చిన్న పిల్లల్లో దేవుడిని చూస్తా



మిడ్జిల్: చిన్న పిల్లల్లో తాను దేవుడిని చూస్తానని.. వారి కోసం ఏదైనా చేస్తానని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అన్నారు. శనివారం దోనూర్, వల్లభరావుపల్లి, అయ్యవారిపల్లి, వాడ్యాల్, వేముల, మిడ్జిల్, బోయిన్‌పల్లి పాఠశాలల్లో తన సొంత ఖర్చులతో విద్యార్థులకు షూ పంపిణీ చేశారు. వచ్చే ఏడాది నుంచి నియోజక వర్గంలోని ప్రతి ప్రభుత్వ పాఠశాల విద్యార్థికి షూ, బ్యాగు, వాటర్ బాటిల్ ఇస్తానని పేర్కొన్నారు. అన్ని పాఠశాలలను దాతల సహకారంతో అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు. తహసీల్దార్ రాజునాయక్, ఎంపీడీఓ గీతాంజలి, ఎంఈఓ మంజులాదేవి, నాయకులు శివకుమార్, రబ్బానీ, అల్వాల్‌రెడ్డి, గౌస్, సాయిలు, మల్లికార్జున్‌రెడ్డి, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

### సమస్యల పరిష్కారానికి కృషి



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక ఏడో వార్డు పరిధిలోని పద్మావతి కాలనీ, గోల్డెన్ హిల్స్ కాలనీల్లో శనివారం సాయంత్రం మున్సిపల్ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను ఆయన దృష్టికి స్థానికులు తీసుకొచ్చారు. ముఖ్యంగా డ్రైయినేజీలు అస్తవ్యస్తంగా ఉన్నాయని, సీసీరోడ్లు దెబ్బతిన్నాయని, కొన్ని చోట్ల ఇప్పటికీ వీధి దీపాలు లేవని, మట్టిరోడ్లతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వివరించారు. కాగా సమస్యలను వీలైనంత వరకు పరిష్కరిస్తామని చైర్మన్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కట్టా రవికిషన్‌రెడ్డి, స్థానికులు కుమార్‌గౌడ్, శేఖర్, మహేశ్, రాంకుమార్ తదితరులు పాల్గొన్నారు.

### నాయీ బ్రాహ్మణులకు శిక్షణ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పీఎం విశ్వకర్మ స్కీం ద్వారా యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమంలో భాగంగా.. జిల్లా కేంద్రంలోని జనశిక్షణ సంస్థాన్ ఆధ్వర్యంలో శనివారం నాయీ బ్రాహ్మణులకు శిక్షణ ప్రారంభమైంది. జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి ఇందిరా హాజరై ప్రసంగించారు. ప్రభుత్వం చేతివృత్తులను బలోపేతం చేసేందుకు పీఎం విశ్వకర్మ స్కీం తీసుకువచ్చిందని అన్నారు. సద్వినియోగం చేసుకోవడం ద్వారా పూర్తిస్థాయిలో ఉపాధి, ఉద్యోగ అవకాశాలను పొందవచ్చని సూచించారు. ఇక్కడ శిక్షణ పొందిన వారికి ధ్రువపత్రంతో పాటు బ్యాంకు ద్వారా ఆర్థికసాయం కూడా అందించేందుకు వెసులుబాటు ఉందన్నారు. జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ సుబ్బారెడ్డి, వనజాదేవి, సత్యనారాయణరెడ్డి, సాయికిరణ్‌రెడ్డి, అర్షద్, బందగీ, తదితరులు పాల్గొన్నారు.

### రెండోరోజు రూ.3,62,888 వసూలు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పట్టణంలోని వివిధ దుకాణాల నుంచి రెండోరోజు శనివారం రూ.3,62,888 ఆస్తిపన్ను వసూలైంది. స్థానిక క్లాక్ టవర్, పాన్‌చౌరస్తా తదితర ప్రాంతాల్లో ఆర్ఓ మహమ్మద్ ఖాజా, ఆర్ఐలు అహ్మద్‌షరీఫ్, రమేష్ బృందం సుమారు 45 షాపులను తనిఖీ చేశారు. వీటిలో 13కి తాళాలు వేయగా కొన్ని గంటల్లోనే యజమానులు ఆస్తిపన్ను చెల్లించడంతో తిరిగి తెరిచారు. కాగా, ఈనెల 19న రూ.8,48,379 వసూలు చేసిన విషయం విదితమే.

### షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



హన్వాడ: నాగినోనిపల్లిలో షార్ట్ సర్క్యూట్‌తో ఓ ఇల్లు శనివారం సాయంత్రం దగ్ధమైంది. గ్రామస్తుల కథనం మేరకు.. కటికె రత్నాజీ తన ఇంటిలో ఫ్రిజ్‌ను ఆన్‌చేసేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో విద్యుత్ బోర్డులో సమస్య వచ్చి ఒక్కసారిగా బ్లాస్ట్ అయ్యింది. దీంతో తీవ్రంగా మంటలు చెలరేగాయి. భయంతో రత్నాజీ, అతడి భార్య, దివ్యాంగురాలైన తన కుమార్తెతో బయటకు వచ్చి ప్రాణాలను కాపాడుకున్నారు. ఇళ్ల మొత్తం పొగ ఆవరించింది. పైకప్పుతో సహ ఇంట్లోని దుస్తులు, వంట సామగ్రి, డబ్బులు దగ్ధమయ్యాయి. ఘటన ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వగా .. వచ్చే సమయానికే తీవ్ర నష్టం జరిగిందని బాధితులు వాపోయారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.